# నిర్ణయం

**–ఉమా మహేశ్వరి**

ఎదురు చూడటంలో ఎంత ఆనందం. కలుసుకున్నప్పటికంటే ఎదురు చూపులోనే ఒక పులకింత.

ప్రతిరోజూ ఆరోజు కూడా అదే పార్కులో అదే ప్రదేశంలో కూర్చున్నారు ప్రదీప్, సుజాతలు.

ఒకరి కళ్ళలోకి ఒకరు మౌనంగా ఆరాధనగా చూస్తూ కూర్చున్న ఆ జంటను చూస్తేనే తెలుస్తోంది వాళ్ళెంత గాఢ ప్రేమికులో.

చుట్టూ ముసురుకొంటున్న చీకట్లను గమనించిన వినోద్ ఉలిక్కిపడ్డట్టుగా చూసి ''లే. సుజా చీకటి పడుతోందిక. వెళ్దాం'' అంటూ సుజాత చేతిని సున్నితంగా నొక్కి వదిలాడు.

ఇల్లు దగ్గరయ్యే సరికి, ఆ వీధి చివరే ఆగి ''సుజా! నాపెళ్ళి విషయంలో నాన్నగారిక ఆగరు. ఏదో ఒక సంబంధం ఖాయం చేస్తారు. నువ్వెలాగైనా ఈ రాత్రికే మీ అమ్మగారితో మాట్లాడు. నువ్వు చెప్పే ఆ శుభవార్త కోసం రేపు సాయంత్రం ఎదురు చూస్తూ వుంటాను. సీ యూ!'' అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

అమ్మతో విషయం చెప్పాలని అనుకొన్న సుజాత ఏమీ చెప్పలేకపోయింది. కారణం? తల్లి ఏదో దిగులుతో ముభావంగా ఉండటమే.

రాత్రిళ్ళు కూడా నిద్రపోకుండా దీర్ఘంగా ఆలోచిస్తూ తనలోతానే కుమిలిపోతున్న తల్లిని గమనిస్తూనే వుంది సుజాత.

ఇన్నాళ్ళుగా ప్రశాంత జీవనం గడుపుకొస్తున్న ఆమెలో ఈ మార్పులోని ఆంతర్యం?

సుజాతకు బాల్యం గుర్తుకొస్తే భయం. తప్పత్రాగి అల్లరి చేసే తండ్రి. ఆ శాడిస్టు చేతిలో అమ్మ పడే నరక యాతన కళ్ళకు కట్టినట్టే గుర్తున్నాయి. ఆ బాధలన్నీ మౌనంగా భరిస్తున్న తల్లిని చూసి- చాటుకు వెళ్ళి గుండెలవిసేలా ఏడ్చుకునేది సుజాత.

ఓ రోజు త్రాగిన మైకంలో రోడ్డు దాటబోయి లారీ క్రిందబడి తండ్రి మరణించాడు. మిగిలిన వన్నీ అమ్మి ఉన్న అప్పులు తీర్చి ఈ ఊరు వచ్చారు.

అదృష్టవశాత్తు సేటు ఇంట్లో ఆయాగా అమ్మకు పని దొరికింది. తల్లి లేని ఆరుమంది పిల్లలకు తానే తల్లిలా సేవ చేసి ఆ యింటి పెద్ద దిక్కుగా వుండిపోయింది. ప్రతి తరగతిలోనూ శ్రద్ధగా పాసయ్యే సుజాతను సేటు అభిమానంగానే చూసేవాడు.

పని పిల్లగా కాకుండా వారి పిల్లగానే పెరిగిందా ఇంట్లో సుజాత. కాని కాలం ఎప్పుడూ ఒకే విధంగా సాగదు.

సేటు ఆరోగ్యం దెబ్బతిన్నది. ముఖ్యంగా స్వస్థలం వెళ్ళాలన్న ఆరాటం అతనిలో ఎక్కువైంది.

ఫలితం! వ్యాపారం అంతా అమ్మి మద్రాసు మకాం మార్చారు వాళ్ళు. సేటు వాళ్ళతో రమ్మన్నా అమ్మ వెళ్ళటానికి ఇష్టపడలేదు.

జీవనోపాధి సమస్యగా మారుతుందని చాల బాధపడ్డారు. మంచి మనసున్న సేటు చిన్న పెంకుటిల్లు ఇచ్చి, దాంతోపాటు తెల్సిన వాళ్ళతో తన పరీక్షల తర్వాత ఉద్యోగం ఇచ్చేట్టుగా మాట్లాడి వెళ్ళాడు.

ఉండటానికింత గూడు, జీవనానికి పని చూపించాడు. వారి నుండి వచ్చే ఉత్తరాలే నేస్తాలు చుట్టాలు.

తండ్రి చనిపోయి, ఈ ఊరొచ్చాక దిగులుగా ఉన్న తల్లిని చూడటం ఇదే మొదటిసారి.

దాదాపు మూడు నెలల క్రితం ఎదురింట్లో వినోద్, వాళ్ళ తండ్రితోపాటు దిగాడు. ఒకరోజు అంకుల్ తనంతట తానే పలకరించాడు. క్రమంగా పరిచయం పెరిగి ఇంటి కెళ్ళేది. వినోద్‌తో అలాగే పరిచయం అయింది.

ఆ పరిచయమే పెరిగి పెద్దదయి ప్రణయంగా మారింది. తన జీవితానికి వినోద్ అడగని వరం లాంటి వాడు. వినోద్ లేని జీవితం వ్యర్థం. అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారిగి పోయింది సుజాత.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళినా ఏ పనీ చేయలేకపోయింది సుజాత. ఏ ఫైల్ తెరచినా వినోద్ రూపమే కనిపిస్తోంది. సాయంత్రమే వినోద్ పెట్టిన గడువు.

ఇంతవరకు అమ్మతో చెప్పనే లేదు. గంభీర వదనంతో, జీవచ్ఛవంలా వున్న ఆమెతో ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు.

ఇలా ఆలోచనలో ఉండగానే అటెండర్ ఉత్తరం అందించాడు. ఆ లెటర్ చింపిన మరుక్షణం మనసంతా ఆనందంతో నిండిపోయింది.

సేటు తన కుమారుని వివాహానికి ఆహ్వానిస్తూ స్వయంగా ఉత్తరం వ్రాశాడు. ఆహ్వానమే కాదు వాళ్ళ కంపెనీలో ఉద్యోగం కూడా ఇస్తామంటూ మళ్ళీ తనూ అమ్మ అక్కడే వుంటే వివాహం కూడా చేస్తామంటూ వ్రాశాడు.

వివాహం అనుకోగానే మళ్ళీ మనసంతా వినోద్ ఆలోచనతో నిండిపోయింది. సేట్‌కు వినోద్ గురించి చెప్పాలి. ఇక తనకే ఉద్యోగం అవసరం లేదు. ముందు అమ్మతో విషయం అంతా చెప్పి, వివాహానికి వస్తామంటూ లెటర్ వ్రాయాలి.

ఇక మనసు ఆగలేదు. లేచి మధ్యాహ్నానికి లీవ్ పెట్టేసి, ఇంటికి బయలుదేరింది. అమ్మను ఒప్పించి సాయంత్రం వినోద్‌కు చెప్పాలి! అనుకుంటూ.

ఇంటి గుమ్మంలో నిల్చుని తలుపు తట్టబోయి హఠాత్తుగా ఆగిపోయిందక్కడే! లోపల ఎవరో మగవాడి గొంతు స్పష్టంగా వినబడుతోంది.

ఎవరని అనుకుంటూ ఆతృతగా తలుపు తట్టబోయి అది వినోద్ తండ్రి కంఠమని గుర్తు పట్టింది.

వినోద్ విషయం చెప్పి వుండొచ్చు. మా గురించే ఏదో మాట్లాడుతున్నట్లుంది. అనుకొని శబ్దం చేయకుండా అలానే తలుపు ప్రక్కగా నిల్చుని వినసాగింది.

''చూడు కమలా! మన పిల్లలకు పరిస్థితులను అర్థం చేసుకొనే సంస్కారం వుంది. పెద్దవాళ్ళు కులమతాలనే అడ్డుగోడలతో మూర్ఖంగా మనల్ని విడగొట్టారు.''

''మనసొకరితో మనువు మరొకరితో అన్నట్లుగా బలవంతాన బ్రతుకుల్ని లాక్కొచ్చాము.''

''పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయ్యారు. వారి వివాహాలై వెళ్ళిపోతే, మనమిక ఒంటరి పక్షులమే కదా! ఇప్పుడైన మనం కల్సి ఒకటిగా జీవిద్దాం. ఇకనైనా ఒంటరి తనమనే రక్కసిని తరిమేద్దాం!''

''ఒకరి కొకరమున్నామనే తృప్తితో జీవిద్దాం. మనల్ని, పిల్లలనూ అర్థం చేసుకొనే వారినే వారి జీవిత భాగస్వాములను చేద్దాం. అడ్డు చెప్పకు! బాగా ఆలోచించు కమలా!''

''తోడు నీడ లేక బిక్కు- బిక్కు- మంటూ దుర్భరమైన శేష జీవితం గడిపేకంటే ఈ వయస్సులో మనిద్దరం ఒకే గూటిలో ఒకే ప్రాణంగా ప్రశాంతంగా వుండాలని నా ఆకాంక్ష.''

''ఇంకా జాప్యం చేస్తు కూర్చోక అమ్మాయితో చెప్పు! వస్తాను కమలా'' అంటూ వెళ్ళిపోయాడు.

తను వింటున్నవి మాటలో, పిడుగులో అన్నట్లయింది సుజాతకు. నిశ్శబ్దంగా వెనుదిరిగింది.



ఎప్పటిలా తెల్లవారింది. అప్పటికే లేచి ముస్తాబయి సూట్ కేస్ సర్దుతున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూసింది కమలమ్మ.

తల్లిని త్వర పెట్టి తాను మెడ్రాస్ వెళుతున్నట్లుగా చెప్పి స్టేషన్‌కు బయలుదేర దీసింది. మద్రాస్ తనూ వస్తానన్న తల్లి మాటను వినిపించుకోలేదు.

స్టేషన్‌కు అంకుల్‌ను కూడా ఆహ్వానించింది. స్టేషన్‌లో అపరిచితుల్లా నిల్చున్న అమ్మను, అంకుల్‌ను చూచి మనసులోనే నవ్వుకుంది సుజాత!

మద్రాసు రైలు ఇంక బయలుదేరుతున్నట్లుగా హెచ్చరిక చేసారు. రైలు ఎక్కబోతు హఠాత్తుగా వెనక్కు తిరిగి తన గుప్పెట్లో ఉంచుకున్న కుంకుమ భరిణ నుండి కుంకుమ తీసి తల్లి నుదుట ఉంచింది. ఏం జరిగిందో తేరుకోని తల్లి చేతిని అంకుల్ చేతిలో ఉంచింది.

అర్థం అయినట్లుగా చూసారాయన!

''వినోద్ అన్నయ్యకు చెప్పకుండా వెళ్తున్నందుకు ఏమీ అనుకోవద్దని చెప్పండి నాన్నా'' మనస్ఫూర్తిగా అంటూ సుజాత రైలు ఎక్కి చేయి ఊపిందిక సెలవు అన్నట్లుగా.

ఒకరి ప్రక్కగా ఒకరు నిలబడ్డ ఇద్దర్నీ కళ్ళ నిండుగా చూసింది. నెమ్మదిగా సీటుకు తలాన్చి కూర్చుంది.

కదిలే రైలు నుండి వెనక్కు పరిగెడుతున్న చెట్లను చూస్తూ...నా నిర్ణయం సరైనదే అనుకొందామె-తృప్తిగా-మనస్సులో...!

★